# అల్లుడు ఎలా వుండాలి ?

ప్రవీణ్ కుమార్ ని చూస్తుంటే ఆ మధ్య వూరెళ్ళినప్పుడు మా బాబాయి చెప్పిన సంగతి జ్ఞాపకము వచ్చింది.

"నువ్వు వెళుతున్నది కొత్త ప్రాజెక్టుకి గదా ! అక్కడెవరయినా జె. ఇ. వుంటే చూడు రుక్మిణికి ఈ యేడు పెళ్ళిచేద్దామనుకుంటున్నాము "

రుక్మిణి మా బాబాయికి ఆఖరు పిల్ల. బి. ఏ. ప్యాసయింది. పెద్ద వాళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాడు. పెద్ద అల్లుడు హైదరాబాదులో డాక్టర్. రెండో వాడు వైజాగ్‌లో లెక్చరర్. మూడో అల్లుడు ఇంజనీర్ కావాలని ఆయన ఉద్దేశ్యం కాబోలు

ఒకరోజు ప్రవీణ్‌కుమార్‌ని ఇంటికి పిలిచి అతిథి సత్కారాలుచేసి అసలు సంగతి బయటపెట్టాను. గ్రూప్ ఫోటోలోవున్న రుక్మిణిని చూపించాను.

"చూడ్డానికి బాగానేవుంది" అని నవ్వాడు అతను

"రుక్మిణి గురించి నాకు బాగా తెలుసు. మంచిపిల్ల, నిగర్వి. మా బాబాయి జిల్లాలో పలుకుబడి గలవాడు. రుక్మిణి ఎంత సింపుల్‌గావుంటుందో చూస్తే ఆశ్చర్యపోతావు. ఈ కాలపు ఆడపిల్లలా జీన్సు అవీ వేసుకుని ఎబ్బెట్టుగా వుండదు. బి. ఏ. ప్యాసయింది" అని రుక్మిణి గురించి చెప్పాను.

ప్రవీణ్ ప్రసన్నమైనట్లు కనిపించాడు.

"నాకు నీతో బంధుత్వము కలుపుకోవడము సంతోషముగానే వుంది. నా గురించి తెలుసుగా! మంచివో చెడ్డవో నాకు కొన్ని ప్రిన్సిపల్స్‌వున్నాయి. ముఖ్యముగా కట్నం ఐ డోంట్ లైకిట్ ఐ హేట్ దట్ బ్లడీ ఫార్మాలిటీ" అన్నాడు సీరియస్‌గా.

ప్రవీణ్ ఫోటో ఒకటి పంపుతూ అతగాడు పైసా కట్నము తీసుకోడని లెటర్ రాసి పడేశాను మా బాబాయికి.

అదిచూసి ఎగిరి గంతేసి వుంటాడనుకుంటాను మా బాబాయి. పెద్ద హడావుడి చేసివుంటాడు ఇంట్లో. అదంతా ఊహించుకుంటే నవ్వొచ్చింది నాకు.

కట్నం తీసుకోకుండా గజిటెడ్ ఆఫీసర్ అల్లుడుగా వస్తానంటే అంతకంటే అదృష్టం ఏముంటుంది ఈ రోజుల్లో! ఆడపిల్ల తండ్రికి అతగాడు సాక్షాత్తూ దేవుడే గదా!

మూడో నాటికి ఏకంగా టెలిగ్రాము కొట్టాడు మా బాబాయి వెంటనే ఆ జూనియర్ ఇంజనీర్ ని వెంటబెట్టుకుని వచ్చెయ్యమని

మర్నాడు ఆదివారమే కాబట్టి ప్రవీణ్ ని తీసుకుని బయల్దేరాను. బస్సు దిగగానే మా బాబాయి కారు డ్రైవర్ వచ్చి సూట్ కేస్ అందుకున్నాడు డ్రైవర్ కి బస్టాండ్ లోనే డ్యూటీ వేశాడట మా బాబాయి

కారుని ఇంటికి తీసుకుపోకుండా గెస్టుహౌస్ కి తీసుకెళ్ళాడు డ్రైవర్. గెస్ట్ హౌస్ లో డబుల్ రూమ్ రిజర్వుచేసి వుంది ఇద్దరు అటెండర్లు రెడీగా వున్నారు. "ఏం కావాలి సార్!" అంటూ నిమిషానికొకసారి పలకరిస్తున్నారు

నేను బాబాయికి ఫోన్ చేశాను. సాయంకాలము నాలుగింటికి ప్రవీణ్ ని తీసుకుని రమ్మన్నాడు.

పెళ్ళిచూపులు విజయవంతంగా ముగిశాయి ప్రవీణ్ ఒడ్డు, పొడుగూ రంగూ చూసి ఇంట్లో ఆడవాళ్ళంతా మెచ్చుకున్నారు.

"ఏమ్ రుక్కూ! ఎట్లా వున్నాడు కుర్రాడు? నచ్చాడా?" అని ప్రశ్నించాను మా చెల్లాయిని.

"అంతా నాన్న ఇష్టం!" అంది రుక్కు బెట్టుచేస్తూ.

"నీ ముఖమే చెప్తుందిలే—నచ్చాడని!" అన్నాను.

రుక్మిణి ముసిముసి నవ్వులు నవ్వుతూ సిగ్గు అభినయించింది.

పెళ్ళంటే ఎక్కడలేని సిగ్గు ముంచుకొస్తుంది ఆడపిల్లలకి ఏమిటో గానీ!

ప్రవీణ్ సంతృప్తి వ్యక్తం చేశాడు.

"అంతా నీ అదృష్టం బాబాయ్! బంగారములాంటి అల్లుడు!" అన్నాను.

బాబాయ్ మీసాలు తిప్పాడు అంతా తన గొప్పే అన్నట్లుగా.

"ఈ రోజుల్లో అటువంటివాడు దొరకటం కష్టం" అన్నాను.

"అంతా రుక్కు అదృష్టం. నాదేముంది?" అన్నాడు.

ప్రవీణ్, అతని నిజాయితీ గురించి చెప్పాను.

ప్రిన్సిపల్స్ గల వ్యక్తి. లంచం అంటే మండిపడతాడు. ముక్కుసూటిగా పోయే మనిషి. పై అధికార్లని అసలు లెక్కచెయ్యడు.

ప్రవీణ్ తన నిజాయితీవల్ల అధికార్లని ఎన్నితిప్పలు పెట్టిందీ, వర్క్ విషయములో కంట్రాక్టర్ల దగ్గర ఎంత ఖచ్చితముగా ప్రవర్తించేది అన్నీ కథలుగా చెప్పాను.

"తొందర్లోనే అక్కడికి వచ్చి ప్రవీణ్ తల్లితో మాట్లాడి ముహూర్తము నిశ్చయించుకుందాం" అని చెప్పింది పిన్ని. ప్రవీణువంటి నీతి, నిజాయితీ గల అల్లుడు దొరికినందుకు పిన్ని ఆనందానికి అంతులేదు.

మర్నాటి పుదయమే ప్రవీణ్, నేను బయల్దేరాం.

మా పిన్ని చెప్పినట్లుగా వాళ్ళు ఏరోజు వసారోనని నేను ఎదురు చూశాను చాలారోజులు. నెలగడిచినా వాళ్ళు రాలేదు సరిగదా ఒకరోజు రుక్మిణి పెళ్ళంటూ వెడ్డింగ్‌కార్డు వచ్చింది. వరుడు సుధాకర్, బి. యి, ఇంజనీర్ అని వుంది.

నాకు మతిపోయినంత పనయింది. కార్డుతో పాటు మా బాబాయి రాసిన లెటర్ చదివాను. అందులో వెంటనే బయల్దేరి రమ్మనివుంది ప్రవీణ్ గురించి ఒక్కముక్కలేదు.

ప్రవీణ్‌తో చెప్పి బాధపడ్డాను–ఇలా జరిగినందుకు, అతను ఏమాత్రం బాధపడలేదు.

"నాకు తెలుసు" అని తేలిగ్గా నవ్వాడు.

"ఎలా తెలుసు చెప్పు"

"నేను చెప్పడం ఎందుకు? మీ బాబాయే చెప్తాడు గదా!" అన్నాడు ప్రవీణ్.

రెండురోజులు ముందే వెళ్ళాను పెళ్ళికి. మా బాబాయిని ఒంటరిగా పట్టుకోవడము గగనమైంది.

రాత్రి పదింటికి దొరికాడు.

విస్కీసీసా ముందుపెట్టుకుని కూర్చున్నాడు, ప్రవీణ్‌కి ఏం తక్కువ రుక్కిణిని అతనికి ఎందుకివ్వలేదు? లక్షకట్నం యిచ్చి సుధాకర్‌కి పిల్లనివ్వడంలో రహస్యము ఏమిటి? ఎన్నో అడగాలని వుంది నాకు"

"బాబాయ్!" అన్నాను.

"నాకు తెలుసులేరా నువ్వేం అడగదల్చుకున్నావో? రుక్కుని మీ ఫ్రెండ్‌కి కాదని లక్షకట్నం యిచ్చి వేరే కుర్రాడికి ఎందుకిస్తున్నావ్, అని గదూ నీ ప్రశ్న" అన్నాడు.

తల వూపాను.

"అల్లుడంటే ఎలా వుండాలిరా?" ప్రశ్నించాడు.

నేను వెర్రిముఖం వేసాను. "అల్లుడు ఎలా వుండాలని నన్ను అడుగుతాడేం? అందంగా, ఠీవిగా, హీరోలా వుండాలి. మంచిహోదాలోవుండాలి బుద్ధిమంతుడై వుండాలి, నీతి నిజాయితీ గలవాడై వుండాలి. మన పురాణాలలో నాయకుడికి గల లక్షణాలు కలిగివుండాలి. టోటల్‌గా నా ఉద్దేశ్యం అది" అదే చెప్పాను బాబాయికి.

నేను చెప్పింది విని పకపక నవ్వాడు.

"అవన్నీ ఇప్పుడు పనికిరావు. రోజులుమారాయిరా బాబూ! అవన్నీ వున్నవాడొక వెధవాయ్. చేతగానివాడు. మీ ఫ్రెండ్‌కి రుక్కుని ఇవ్వకపోవడానికి కారణము అదే"

నేను విస్తుపోయాను.

"నీతిగా ఉద్యోగం చేసేవాడికి మిగిలేది జీతంరాళ్ళేగా. వాటితో ఏం సంపాదిస్తాడు? నాబొంద. లంచాలు పుచ్చుకోవడం చేతగాని వాడికి ఇవ్వడం మాత్రం ఏం చేతనవుతుంది చెప్పు? ఇక ప్రమోషన్‌లు ఎలా వస్తాయి?అధికార్లకి ఎసరు పెడుతుంటే అర్నెల్లకొకసారి ట్రాన్స్‌ఫర్లు తప్పవు. ఫుట్‌బాల్ ఆడుకుంటారు. ఇటువంటివాడితోటి యిట్లా నీతులు చెప్పేవాడిని కట్టుకుని రుక్కు ఏం సుఖపడుతుందంటావ్?" అని ప్రశ్నించాడు మా బాబాయ్

నేనేం చెప్పగలను ?

"ఇతగాడికి ఎప్పుడో జ్ఞానం వస్తుంది. ఎల్లకాలం యిట్లాగే వుంటాడని నేననను. కాని అప్పటికి సమయం మించుకుపోతుంది. చేతులుకాలాక ఆకులు పట్టుకుంటే లాభం ఏముంది ?"

నేను వెర్రిముఖం వేశాను.

"కట్నం మిగిలిపోతుందని వాడికి కట్టబెట్టే దానికంటే పిల్లనిగొంతు పిసికి బావిలో పారెయ్యడము మేలు" అని ముగించాడు బాబాయి గ్లాసు పైకెత్తుతూ.

"అయ్యో! తెలిసిందిగదా! ఈ రోజుల్లో అల్లుడెలా వుండాలో!" *

ప్రచురణ: విజయ, ఏప్రిల్ 1981